పుట్టలోని చెదలు

ద్విభాష్యం రాజేశ్వరరావు

దశరథరామయ్యగారు బాధగా మంచంమీద కదిలేరు. పొత్తి కడుపులో ఆరంభమయిన మంట కార్చిచ్చులా వ్యాపించి గుండెల్ని దహిం చేస్తున్నట్లు అనిపిస్తోంది. బాధ భరించలేక రెండు నిమిషాలు మెలికలు తిరిగిపోయారు. "ఏమండీ! మళ్ళీ నొప్పివస్తోందా?" అంటూ జానకమ్మ ఆయన భుజాలమీద అనునయంగా రాసింది.

నోటిలో సమాధానం చెప్పలేక అవునన్నట్లు తలపూపేరు దశరథరామయ్యగారు. నొప్పి భరించలేక కళ్ళు బిగబట్టి మూసుకుంటే, రెప్పల చాటునుండి రెండు కన్నీటి బిందువులు ముడతలుపడ్డ బుగ్గలమీదనుండి పండు మీసాల మీదకు జారిపోయి ఆ గుబురులో నిలిచి పోయేయి. భర్త పడుతున్న అవస్థను గమ నించిన జానకమ్మ గుండెలు అవిసిపోయాయి.

"ఈ మంచి నీళ్ళు త్రాగండి. నొప్పి సర్దు కుంటుంది" అంటూ గాజు గ్లాసుతో నీళ్లు అందిం చింది. మంచంమీద ఆయన లేచి కూర్చో టానికి వెనుక చెయ్యివేసి సాయంచేసింది. జానకమ్మ ఆసరాతో కూర్చొని మంచి నీళ్ళు రెండు గుటకలు మింగి గ్లాసు ప్రక్కనున్న టేబిలుమీద వుంచేరు. మళ్ళీ మంచంమీద వెనక్కి వాలి కళ్ళుమూసుకున్నారు. మూడు నిమిషాల్లో కడుపు మంట కొంచెం చల్లారినట్టు అన్పించింది. అయితే ఇది కేవలం తాత్కా లిక ఉపశాంతి మాత్రమే! ఏదో కడుపులో పడగానే చల్లారుతుంది. మళ్ళీ కొద్ది సేపటికి మామూలే!

అంతలో వీధి వాకిలి గేటు తెరిచిన శబ్ద మయింది. "చూడు జానకీ! ఎవరో వచ్చినట్లు న్నారు" అన్నారు దశరథరామయ్యగారు హీన స్వరంతో. జానకమ్మ వీధివైపు చూసింది. పేపరు కుర్రాడు పేపరు లోనికి గిరాటువేసి సైకిలెక్కి వెళ్ళిపోయాడు. పేజీలు సర్దిలోనికి తీసుకువచ్చింది.

"పోస్టుమేన్ రాలేదా?" జానకమ్మ చేతి లోని పేపరు వంక చూస్తూ మెల్లగా అడిగేరు దశరథరామయ్యగారు.

"ఇంకా రాలేదు" అంది ఆవిడ. పోస్టుమేన్ ఆ వీధికివచ్చి వెళ్లిపోయి అప్పుడే అరగంట అయింది.

కాని, ఆ విషయం భర్తకు చెప్పటం ఆమెకు ఇష్టంలేదు. మరోగంటసేపు ఆయన్ని ఆ నిరీక్షణలో వుంచటమే ఆమె కిష్టం!

పేపరు ఆయన చేతికి అందించి "మందు వేసుకుంటారా?" అంది.

"మరి కొంచెంసేపు పోనీయ్!" అని రెండు క్షణాలాగి "అసలు, నువ్వు రాసిన ఉత్తరం వాడికి అంది వుంటుందా?" అడిగేరు.

"ఎందుకు అందదు? ఒకటికాదు, రెండు రాసేను. మీ ఆపరేషను ఇరవైయ్యో తారీఖున చేస్తానన్నారు. పదిహేడో తేదీకి—అంటే మూడు దినాలు ముందుగానే సెలవుపెట్టి రమ్మని రాసేను. ఈవేళ తారీఖు పదమూడు. సమాధానం రాయకుండా ఏకంగా బయలుదేరి వచ్చేద్దామని ఊరుకున్నాడేమో!" అంది జానకమ్మ.

"నాకు నమ్మకంలేదు" అన్నారు దశరథ రామయ్యగారు హీనస్వరంతో.

"తప్పకుండా వస్తాడండి. అయినా ఉద్యో గంలో వాడికెన్ని సాధక బాధకాలున్నాయో!

శెలవు దొరకటం కష్టమయిందేమో! ఇవన్నీ ఆలోచించొద్దూ!"

విరక్తిగా నవ్వేరాయన "జానకీ! వాడికి ఎనిమిదో ఏట కలరా వచ్చింది. నీకు జ్ఞాపకముందా?"

జానకమ్మ అవునన్నట్లు తలవూపింది.

"వాడికి వాంతులూ, విరోచనాలు అయిదు రోజుల వరకూ తగ్గలేదు. మనం ఇద్దరం ఆ వెధవని—అదిగో, అక్కడే, ఆ వీధి వరండాలో పెట్టుకుని కంట్లో వత్తులు వేసుకుని రాత్రీ పగలూ కాపలా కాసేం. నేను ఉద్యోగంలో చేరి ఇంకా పర్మనెంటు అవకుండా అన్ని దినాలు శెలవు పెట్టాననే కదూ; నా ప్రొబెషనరీ పీరియడు ఇంకో సంవత్సరం పొడిగించేరు!!



వాడు 'ఎస్సెల్సీ' చదువుతూ వుండగా కడుపులో కాయవేస్తే వాడి ఆపరేషను కోసం మద్రాసు నాలుగు మాట్లు తిరిగి రెండు నెలలు శెలవు పెడితేనే కదూ నాకు రావాల్సిన ప్రమోషను కాస్తా వెనకబడిపోయింది! ఇలా ఎన్నని ఏకరవుపెట్టను? నీకు మాత్రం తెలీదా! నువ్వూ, నేనూ ఎన్ని బాధలుపడి వాడిని పెంచకపోతే, వాడు ఈ రోజు ఇలా తిరుగుతున్నాడు? ఒక్కగా నొక్క నలుసని కంటికి రెప్పలా వాణ్ణి సాకొచ్చేం. అందుకు ఇదీ ఫలితం! వాడికి రెక్కలొచ్చాయి! కళ్ళు విడ్డాయి! ఎగిరిపోయాడు! రాధమ్మ వాణ్ణి వలలో వేసుకుంది. దాన్ని పెళ్ళిచేసుకుని ఏకంగా మామ గారింట్లోనే కాపురం పెట్టేడు. ఈవేళ నా ఆరోగ్యం సంగతి వాడికి ఎలా పడుతుంది! వాడు రాడు! వాడు వద్దామనుకున్నా కోడలు రానివ్వదే!" మాట్లాడటం ఆపేరు దశరథ రామయ్యగారు. ఆవేశంతో ఆయన గుండెలు ఎగిరెగిరి పడుతున్నాయి. ఊపిరి బరువుగా పీల్చుకుంటున్నారు.

జానకమ్మ మౌనంగా వుండిపోయింది.

భర్తకు ఎలా సర్ది చెప్పటం?

రామం తప్పక వస్తాడని తను మాత్రం ఎలా చెప్పగలదు?

ఏడాది క్రితం ఉద్యోగం కోసం హైదరాబాద్ వెళ్ళిపోయి, ఈవేళ్టి వరకూ ఇంటిమొహం

చూడలేదు. మామగారు ఉద్యోగం ఇప్పించేరు. ఇల్లరికం వుంచేసుకున్నారు. ఎప్పుడో రెండు నెల్లకి ఓ ఉత్తరం రాస్తాడు. పండిన ఈ వయస్సులో తనూ, భర్తా ఇక్కడ! కొడుకు అక్కడ!

'ఏదైనా పెద్ద ఇల్లు విడిగా తీసుకోరాదూ! మేమూ అక్కడికే వచ్చేస్తాం' అంటూ బోలెడు ఉత్తరాలు రాసింది తను.

'ఇక్కడ పెద్ద ఇళ్ళు దొరకటమంటే మాటలా? ప్రయత్నాలు చేస్తున్నాను. దొరక గానే రాస్తాను' అంటూ ఆరుమాసాలుగా మాట లతోనే పెదాలమీద బూరెలు వండుతున్నాడు.

'అద్దాల్లో వున్ననాడు బిడ్డలు కాని, మీసా లొచ్చేక బిడ్డలా?' అనుకొంది.

"అప్పుడే పన్నెండయి పోయింది. అన్నం వడ్డిస్తాను" అంటూ భర్త సమాధానం కోసం ఎదురు చూసింది జానకమ్మ.

"ఆకలిగా లేదు" అన్నాడు దశరథ రామయ్యగారు.

"ఆకలి లేదని తినటం మానేస్తే ఎలా? మరీ నీరసం చేస్తుంది. రెండు మెతుకులు ఎంగిలి పడుదురుగాని, లేవండి." అని క్షణం ఆగి, "పోనీ కంచంలో కలిపి తీసుకురానా? మంచంమీద కూర్చొని తిందురుగాని" అంది జానకమ్మ.

కళ్ళు మూసుకుని వద్దన్నట్లు తల అడ్డంగా ఆడించేరు.

గది గుమ్మానికివున్న తెర సర్ది వీధిలోకి వచ్చింది జానకమ్మ.

గేటు ప్రక్కనున్న జామచెట్టుమీద వాలి కాకి ఒకటే గోలచేస్తోంది.

శీతాకాలమే అయినా, మధ్యాహ్నం ఎండ మాత్రం విపరీతంగా వుంది.

అంతలో రోడ్డుమీద రిక్షా ఆగిన చప్పు డయింది.

రిక్షాలోంచి ఎవరో దిగుతున్నారు! వాడే! రాముడే! సందేహంలేదు!

జానకమ్మ మనసు ఆనందంతో హరివిల్లే అయింది. ఒక్క ఏడాదిలో కొడుకు ఎంత ఎదిగిపోయాడు! చలవకళ్ళజోడు. బెల్ పంట్లాం. చేతిలో చిన్నపెట్టె! దొరబాబులా వున్నాడు! పోల్చుకోలేనంత మారిపోయాడు.

రిక్షాకు డబ్బులిచ్చేసి వీధిలోనుండే తన వంక తిరిగి చిరునవ్వుతో "బాగున్నావా అమ్మా!" అన్నాడు.

ఆనందంతో నోటమాట రాలేదు జాన కమ్మకు.

గబగబా అడుగులేసుకుంటూ లోనికి నడి చింది—కాదు! పరుగెత్తింది!

"ఏవండీ!" అంటూ భర్త దగ్గరకు వెళ్లి "రామం వచ్చేడండీ! వాడురాడని బెంగపెట్టేసు కున్నారు మీరు! నా మాటలు విన్నారు కాదు! వాడు నా కొడుకండీ! మీకు ఆపరేషనని రాస్తే రాకుండా ఎలా వుంటాడు?" అంటూ ఆనందోద్వేగాలతో మాట్లాడింది.

దశరథ రామయ్యగార్కి ఒక్కసారి వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్లయింది.

ఆనందంతో ఆయన మనసు సముద్రమల్లే ఉప్పొంగింది.

అంతలోనే రామం లోనికివచ్చి సూట్‌కేసు ప్రక్కనపెట్టి తండ్రి మంచంవద్దకువచ్చి "ఎలా వున్నావు నాన్నా! అమ్మో! ఇంతలా చిక్కి పోయారేమిటి? ఆపరేషను 'సెపెల్'కి వచ్చే వరకూ ఊరుకున్నారేమిటి?" అంటూ ప్రక్కన కూర్చుని ప్రశ్నల వర్షం కురిపించేడు.

దశరథ రామయ్యగార్కి ఆనందంతో కళ్ళల్లో నీళ్ళు తిరిగేయి.

"నాకేం, బాగానేవున్నాను! ఎప్పుడో నిన్న సాయంకాలం ఎక్కిన రైలు ఎండన పడి వచ్చావు, స్నానంచేసి నాలుగు మెతుకులు తినిరా! జానకీ, రామానికి స్నానానికి నీళ్ళు పెట్టు! రాధమ్మ ఎలావుందిరా? అసలే వట్టి మనిషికాదు, జాగ్రత్తగా చూసుకుంటున్నావా?" ఎన్నెన్నో ప్రశ్నలు వేశారు. తనే సమాధా నాలు చెప్పుకున్నారు కొన్నిటికి. హెచ్చరికలు చేశారు. కొడుకు ఒళ్ళు తడిమి "ఇలా చిక్కి పోయావేమిట్రా! నీకా హైద్రాబాద్ నీళ్ళు పడ లేదు" అంటూ వాపోయారు.



"మీరు విశ్రాంతి తీసుకోండి. నేను వెళ్ళి స్నానంచేసి వస్తాను" అంటూ అక్కడనుండి లేచాడు రామం.

దశరథ రామయ్యగారు మంచంమీద లేచి కూర్చున్నారు.

ఇప్పుడాయనకు పేపరు చదవటానికి ఉత్సాహంగా వుంది. లేచి గంతులు వెయ్యాలని కూడా వుంది. రామం వచ్చినందుకు మనసు ఆనందంలో ఉప్పొంగిపోతోంది, అంతవరకూ వున్న బెంగ, భయం తీరిపోయాయి. ఇంక వెయ్యి ఆపరేషన్లు చేయించుకునేందుకయినా ఆయన మనసు రెడీ అయింది. సగం ఆరోగ్యం అప్పుడే చేతికి అందినట్లయింది. ఉత్సాహంగా పేపరు చదవటంలో లీనమయ్యారాయన.

రామం స్నానం ముగించి భోజనానికి సిద్ధమయ్యాడు.

జానకమ్మవచ్చి "మీరూ లేవండి, నాలుగు మెతుకులు తిందురుగాని" అంది.

"నాకు ఆకలిగాలేదు. వాడికి వడ్డించు" అన్నారు.

జానకమ్మ వంటింట్లో పీటవేసి రామానికి అన్నం వడ్డించింది. కొసరి కొసరి రామంచేత తినిపిస్తోంది. దశరథ రామయ్యగారు పేపరు చదవటం ముగించి టేబిలుమీద పడేశారు. వంటింట్లో మాట్లాడుకుంటున్న తల్లీ కొడుకుల సంభాషణ ఆయన చెవిని పడుతోంది.

"అయితే నీకు ఆ రెండు ఉత్తరాలూ అందేయా, లేదా?" జానకమ్మ గొంతు.

"అందేయమ్మా! తీరిక దొరక్క సమాధానం రాయలేకపోయాను. నేను ప్రమోషన్ పేనల్‌లో వున్నానమ్మా! ఇప్పుడు శెలవు పెట్టడం సాధ్యపడదు. ఈ ఒక్క రోజుకే ఆఫీసరు మూలుగుతూ శెలవిచ్చేడు ." కొంతసేపు నిశ్శబ్దం తర్వాత మళ్ళీ రామం గొంతు "మా జోనల్ మేనేజరు ఈవూరి తాసిల్దారుగారి అల్లుడే! నాన్నా, తాసిల్దారుగారూ ప్రాణ స్నేహితులు కదా! అందుకని నాన్నచేత తాసిల్దారుగార్కి చెప్పించి వాళ్ళ అల్లుడికి నా ప్రమోషన్ గురించి రికమెండేషను లెటరు తీసుకు వెళ్దామని వచ్చేను. ఈ ఉత్తరం తీసుకు వెళ్తే నాకు ప్రమోషను ఖాయం.... "

"వీలు చేసుకుని ఆపరేషను ఒక్క రోజూ ఇక్కడ వుండేలారాలేవురా! " జానకమ్మ అభ్యర్థన. "ఇరవయ్యో తారీఖు మా మేనేజరు కూతురు పుట్టిన రోజు! ఆ పార్టీ ఏర్పాట్లన్నీ ఆయన నా నెత్తిన పడేశాడు. తీరామాట ఇచ్చాక ఇప్పుడు కాదంటే బాగుండదు." రామం గొంతు దశరథ రామయ్యగారి మనసుని కోత పెడుతోంది. దీర్ఘంగా నిట్టూర్చి మెల్లగా మంచంమీద వెనక్కు వాలేరు. □